ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

సోమవారం 17 ఫిబ్రవరి 2025



మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

వేములవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 120 మందిని శనివారం కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. ఇందులో మద్యం సేవించి ఆటో నడిపిన డ్రైవర్‌కు జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి మూడు రోజుల జైలు శిక్షను విధించారని తెలిపారు. మిగిలిన 119 మందికి జరిమానా విధించినట్లు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశాలకు, పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతాయని, ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ఆదివారం సిరిసిల్ల పట్టణంలో తెలంగాణ సంస్కృతిక సారథి కళా బృందం తమ పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవి కాలంలో ఎండలు తీవ్రమై వడగాలులు వీచే అవకాశం ఉందని కూలీ పనులు చేసుకునే కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఉదయం సాయంత్రం తప్ప మధ్యాహ్నం బయటకు రావద్దని తప్పనిసరి అయితే మాత్రం టోపీలు, గొడుగులు ఉపయోగించుకోవాలని ఎక్కువ శాతం నీటిని తీసుకోవాలని, వడ దెబ్బ తగిలిన వారికి తడిగుడ్డతో తూడుస్తూ నిమ్మరసం ఉప్పు కలిపి నీటిని తాగించి ఆసుపత్రికి తీసుకెల్లాలని నిర్లక్ష్యం చేయవద్దని తమ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బృందం లీడర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి, సభ్యులు శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిల్ల పర్శరాములు, వంతడుపుల గణేష్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పన్నుల వసూళ్లు పూర్తి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వంద శాతం పన్నులు వసూలు చేసినట్లు ఎంపీవో జోగం రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 24గ్రామాల్లో 15,395 గృహాలకు సంబంధించి 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను రూ.1,04,97,849, ఇతర పన్నుల కింద రూ.31,36,400 వసూలు చేశామని పేర్కొన్నారు. సహకరించిన అధికారులు, గృహ యజమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతులు పొందితే అదనపు ట్రాన్స్‌ఫార్మర్..

గంభీరావుపేట ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్తఫానగర్ పరిధి ట్రాన్స్‌ఫార్మర్‌కు 100 కేవీ కంటే ఎక్కువ లోడు పడుతున్నందున నూతన వ్యవసాయ కనెక్షన్ శాంక్షన్‌కు రైతులు డబ్బులు చెల్లించి అనుమతులు పొందినట్లయితే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని సెస్ ఏఈ రుషిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎస్ఎస్‌వీ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం 100కేవీకి 125కేవీ లోడు పడడంతో తరచూ కాలిపోతుందని ఏఈ తెలిపారు. రైతులు డబ్బులు చెల్లించి అనుమతులు పొందినట్లయితే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసస్తామన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈనెల 21న వేములవాడలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు ఎదురుగట్ల ఎల్లయ్య, బైరి శేఖర్, సుదగోని పర్శరాములు, తాడూరి రాజయ్య, విజయ్‌కుమార్, బాలరాజులున్నారు.

సాగు లెక్కకు 'డిజిటల్' సర్వే



ఇల్లంతకుంటలో డిజిటల్ సర్వే చేస్తున్న అధికారులు

- జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా 52 క్లస్టర్లలో పంట లెక్కలు
- జిల్లాలో 1.43 లక్షల రైతులు.. 95,449 ఎకరాల్లో పంట పరిశీలన
- ఇప్పటివరకు 32,707 ఎకరాల్లో సర్వే
- యాసంగిలో 1.80లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు
- వరి 1.76లక్షల ఎకరాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సమృద్ధిగా వర్షాలు కురియడంతో నీటి లభ్యత ఆశతో యాసంగి పంటల సాగు వైపు రైతులు ముందడుగు వేశారు. జోరుగా వరినాట్లను పూర్తి చేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగిలో 1.80 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఆశాజనకంగానే భూగర్భ జలాలు ఉంటాయని రైతులు వరిసాగు వైపు మొగ్గు చూపారు. జిల్లాలో 1.76 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. కూలీల కొరత ఉన్నా ఇతర రాష్ట్రాల నుంచి వలసవచ్చిన కూలీలతో నాట్లను పూర్తి చేసుకున్నారు. గతంలో ప్రభుత్వం క్రాప్ బుకింగ్ ప్రక్రియను చేపట్టింది. ప్రస్తుతం యాసంగిలో పంటల సాగు వివరాలు ఖచ్చితంగా ఉండే విధంగా డిజిటల్ క్రాప్ సర్వేను ప్రారంభించింది.

● జిల్లా వ్యాప్తంగా 95,449 ఎకరాల్లో సర్వే..

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా పైలట్ ప్రాజెక్ట్‌గా 52 క్లస్టర్లలో డిజిటల్ క్రాప్ సర్వే కొనసాగుతోంది. ప్రభుత్వం మండల విస్తరణ అధికారులతో సర్వేను చేస్తోంది. వివిధ పంటల సాగు వివరాలను ఫోన్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. పంటల నమోదు ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చే దిశగానే కేంద్రం డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విధానాన్ని తీసుకవచ్చింది. ఇందులో భాగంగానే డిజిటల్ సర్వే కొనసాగుతున్నా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. పంటల బీమాతో పాటు ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకున్న సమయంలో డిజిటల్ సర్వే ద్వారా నష్టాన్ని అంచనా వేసే అవకాశం ఉంటుంది. పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ సర్వేలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు 1,43,936 మంది రైతులకు సంబంధించి 95,443 ఎకరాల్లో సర్వే చేసే విధంగా లక్ష్యంగా పెట్టారు. జిల్లాలో ఇప్పటి వరకు 39,855 మంది రైతులకు సంబంధించి 32,707 ఎకరాల్లో సర్వే చేశారు. డిజిటల్ సర్వేలో గంభీరావుపేట మండలంలో గంభీరావుపేటలో 5,002 మంది రైతులు 2,094 ఎకరాలు, లింగన్నపేటలో 4,067 మంది రైతులు 2,089 ఎకరాలు, నర్మాలలో 5,106 మంది రైతులు 2,098 ఎకరాలు, సముద్రలింగాపూర్‌లో 3,168 మంది రైతులు 2,099 ఎకరాలు, ఇల్లంతకుంట మండలంలో దాచారంలో 2,015మంది రైతులు 1,854 ఎకరాలు, ఇల్లంతకుంటలో 2,414మంది రైతులు 1,842 ఎకరాలు, గాలిపెల్లిలో 2,543మంది రైతులు 1,838 ఎకరాలు, పెద్దలింగాపూర్‌లో 3,379 మంది రైతులు 1,832 ఎకరాలు, పొత్తూర్‌లో 2,902 మంది రైతులు 1,847 ఎకరాలు, రేపాకలో 3,669 మంది రైతులు 2,098 ఎకరాలు, వల్లంపట్లలో 3,235 మంది రైతులు, 1,841 ఎకరాలు, ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో 3,079 మంది రైతులు 1,851 ఎకరాలు, బందనకల్‌లో 2,719 మంది రైతులు 2,099 ఎకరాలు, చీకోడులో 3,125 మంది రైతులు 2,089 ఎకరాలు, మద్దికుంటలో 1,880 మంది రైతులు 1,849 ఎకరాలు, ముస్తాబాద్‌లో 2,733 మంది రైతులు 1,848 ఎకరాలు,

మిగతా 8లో

రహదారుల పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ (హమ్) కింద గ్రామీణ రహదారుల నిర్మాణాలు, మరమ్మతు పనులను వెంటనే చేపట్టి సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట-మరిమడ్ల, మండలంలోని వెంకటాపూర్- ముస్తాబాద్ మీదుగా రాజన్నపేట వరకు విస్తరించే రహదారులను ఆదివారం ఆయన పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పక్కా ప్రణాళికతో పనులను వేగవంతం చేయాలని సూచించారు. హమ్ పథకం కింద గ్రామీణ రోడ్లు, వర్షాలకు కోతకు గురైన రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు వల్ల గ్రామీణ ప్రాంతాలు కొత్త రూపును సంతరించుకుంటాయని, పనుల్లో జాప్యంచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంట ఆర్ అండ్‌బీ ఈఈ వెంకటరమణయ్య, డీఈ శాంతయ్య, నవీన్, నవ్యశ్రీలు ఉన్నారు.

● గంభీరావుపేట : హైబ్రిడ్ యాన్యూటీ మోడల్(హమ్) కింద రోడ్ల నిర్మాణం మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. గంభీరావుపేట మండలం నర్మాల నుంచి కోళ్లమద్ది, లింగన్నపేట మార్గంలోని బ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. త్వరగా హామ్ రహదారుల పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా లింగన్నపేట బ్రిడ్జి పనులను త్వరగా పూర్తిచేయించాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి..



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముస్కు మల్లారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీకి రోజురోజుకు ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. చిన్నతనంలోనే కబడ్డీలోని మెళకువలు నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సింగారపు తిరుపతి, రాష్ట్ర జాయింట్‌సెక్రెటరీ సంపత్‌రావు, కోశాధికారి దేవతప్రభాకర్, పెటా జిల్లా అధ్యక్షుడు అనీల్‌గౌడ్, బొడ్డు నారాయణ, మామిడి శ్రీనివాస్, సాన బాబు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు ఘటన అమానుషం..

గంభీరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రంలో జరిగిన ఘటన అమానుషమని జై తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసెల చంద్రం ఆరోపించారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత విద్యార్థి బుల్లెట్ నడిపాడని రెండు చేతులు నరకడం హేయమైన చర్యని ఖండించారు. బుల్లెట్ నడిపితే అంత వివక్ష చెందాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇంతకుముందు ఉత్తరప్రదేశ్లో గుర్రం ఎక్కాడని ఒక పెళ్లి కొడుకును చంపేశారని, ఇప్పుడు బుల్లెట్ నడిపించినందుకు విద్యార్థి చేతులు నరకడం చాలా అమానుషమైన ఘటనని అన్నారు. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా ఇంకా ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వాన్ని నిందించకపోయినా సమాజంలో జరుగుతున్న పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఒక పక్షపాత బుద్ధితో ఎస్సీ చట్టాన్ని నీరుగార్చే పనిలో సుప్రీంకోర్టు ఉందని ఆయన ఆరోపించారు.

కుల గణన సర్వేతో బీసీ కులాలకు అన్యాయం..

- తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



వేములవాడలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్/వేములవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజోతి) : కుల గణన సర్వేతో బీసీ కులాలకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్ క్లబ్‌లో బీసీ కులగణన అన్యాయంపై మున్నూరు కాపుల రచ్చబండ కార్యక్రమను ప్రారంభించారు. అలాగే వేములవాడలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాటాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో మున్నూరు కాపులతో పాటుగా అన్ని బీసీ కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఉద్దేశ పూర్వకంగానే సర్వేలో బీసీల జనాభా తగ్గించారని ఆరోపించారు. మున్నూరు కాపులకు జరిగిన అన్యాయంపై వారం రోజుల పాటు రచ్చబండ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేతో కూడా మున్నూరుకాపులకు న్యాయం జరుగుతుందని అనుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నెలరోజుల సమయం తీసుకొని మున్నూరుకాపుల కులగణను చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాలలో జనాభ ప్రాతిపదికపై రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించాలని ప్రభుత్వాన్ని జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్ కోరారు. ఆయా కార్యక్రమాల్లో మున్నూరుకాపు సంఘం పట్టణ కమిటీ సభ్యులు ఒజ్జల అగ్గిరాములు, కుల్ల సత్తయ్య, దుమాల రవి, చల్ల రవి, మాదం కుమార్, కొడిమ్యాల వేణు, ఎరుకల ప్రకాష్, పల్లికొండ నర్సయ్య, దుమాల రాములు, పడిగెల రాజు, కొట్టె శ్రీనివాస్, లింగంపల్లి రాము, పట్టణ బీసీ సంఘం అధ్యక్షుడు తూపుకారి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ మారం కుమార్, కొండ కనకయ్య, సీహెచ్ రామస్వామి గౌడ్, కూరగాయల మల్లేశం, కుంభం రవి, చేను హెలపతి, ఉయ్యాల భూమయ్య గౌడ్, కంశాని శ్రీధర్, చవాన్ అర్జున్, బోగ శ్రీధర్, ఎట్టం సాయి కృష్ణ, మిద్దె వినీత్ గౌడ్, ఏదుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'భరోసా'తో బాధిత మహిళలకు రక్షణ

- వార్షికోత్సవంలో ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలకు రక్షణ కోసం భరోసా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల భరోసా కేంద్రం వార్షికోత్సవంలో భాగంగా ఆయన కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భరోసా కేంద్రం బాధిత మహిళలకు, బాలికలకు వైద్యం, కౌన్సెలింగ్, ఇతర రకాల సేవలు అందించడంతో పాటు పోలీస్‌లకు అండగా ఉంటుందనే మనోధైర్యం కల్పిస్తుందన్నారు. భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. భరోసా కేంద్రాలలో దేశంలోనే ముందంజలో ఉన్నామన్నారు. భరోసా సహాయ కేంద్రాలు సమగ్రమైన సహాయాన్ని అందించడానికి, ఆపదకు లోనైన వారికి పోలీస్‌స్టేషన్‌లకు, ఆసుపత్రులకు దూరంగా సురక్షితమైన వాతావరణంలో చేయూత అందించడానికి ఏర్పాటు చేయబడ్డాయన్నారు. హింస, లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, స్త్రీలకు రక్షణ కల్పించడమే లక్ష్యమన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, బాలికలకు సంబంధించిన కేసు పోలీస్ స్టేషన్‌లో నమోదు కాబడిన సమయం నుంచి బాధితులకు అండగా ఉంటూ వారి మానసిక పరిస్థితి గురించి తెలుసుకుంటూ వారికి భరోసా కల్పిస్తూ, భరోసా సెంటర్ల గురించి అవగాహన కల్పిస్తున్న సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఏవో పద్మ, ఎస్ఐ జ్యోతి, ఎస్ఐలు అశోక్, పృథ్వీందర్‌గౌడ్, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ శిల్ప, లీగల్ సపోర్ట్ అధికారి అనంత, స్వభావతి, వెన్నెల, రిసెప్షనిస్ట్ మల్లీశ్వరీ, ఏఎన్ఎం పవజిత తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్

రైతులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు..

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్ట్ నీరు వాడుకోకుండా ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ నీటిని 9వ ప్యాకేజీ కాల్వద్వారా రైతులకు అందిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. దీన్ని స్వాగతించాల్సింది పోయి బీఆర్ఎస్ రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తోందని ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని 9వ ప్యాకేజీ కాల్వకు సరఫరా అవుతున్న నీటిని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంలతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎగువ ప్రాంత రైతులకు సాగు నీరందించే 9వ ప్యాకేజీ కాల్వ పనులను పూర్తిచేయడంలో కేటీఆర్ విఫలమయ్యారన్నారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్‌లకు నీటిని తరలించుకుపోయిన ఎందుకు పట్టించుకోలేరని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ వద్ద కుంగిపోయి సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో వరద నీటిని నిల్వచేస్తే ప్రమాదం పొంచి ఉంటుందని నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు ఆదేశిస్తే గేట్లు ఎత్తి వేయడం వల్ల నీరంతా సముద్రంలో కలిసిపోయిందన్నారు. గత బీఆర్ఎస్ కాళేశ్వరం నీటితో 1.30లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండితే గొప్పలు చెప్పుకున్నారన్నారు. కుంగిపోయిన కాళేశ్వరం నీటిని వాడుకోకుండానే నాటి కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్ట్‌ల ద్వారా సాగు నీటిని అందించి 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారన్నారు. సాగు నీటిని తీసుకువచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు క్షీరాభిషేకం చేయాలని సూచించారు. మల్కపేట నుంచి సింగసముద్రం చెరువు వరకు కాల్వ ద్వారా నీటిని అందించామని రానున్న రోజుల్లో ఎత్తిపోతలతో ఎగువ మానేరు జలాశయాన్ని నింపుతామని ఆది శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, రాంరెడ్డి, రాజయ్య, బాలయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, అంజయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి డబుల్ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు..



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు(ఫైల్)

8

ఘనంగా పోచమ్మ బోనాలు



ముస్తఫానగర్‌లో బోనాలతో మహిళలు..

8

ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శిక్షకులు కృష్ణ తెలిపారు. ఆయుష్ ఆరోగ్య మందిర్(ఆయుర్వేదం) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో నిర్వహిస్తున్నామని, ఏరియాఆసుపత్రిలో ఉదయం 7.45 గంటల నుంచి 8.45 గంటల వరకు శిక్షణను ఇస్తున్నాట్లు తెలిపారు. యోగా శిక్షణతో అనారోగ్య సమస్యలను అరికట్టవచ్చని తెలిపారు.

సిరిసిల్ల మసీద్ కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ సమీ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మసీద్ కమిటీ ఎన్నికల్లో సయ్యద్ సమీ గెలుపొందారు. అధ్యక్ష పదవికి సయ్యద్ సమీ, ముస్తఫా పోటీపడ్డారు. 20 ఓట్ల మెజారిటీతో సమీ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ముంతాజ్ ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన సయ్యద్ సమీని సభ్యులు ఘనంగా సన్మానించారు.

బర్డ్ ఫ్లూ ప్రభావం.. చికెన్ సెంటర్ల వెలవెల..

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ తెలంగాణ రాష్ట్రంపై కూడా పడింది. బర్డ్‌ఫ్లూతో కోళ్ల ఫాంలలో కోళ్ళు చనిపోతుండడంతో చికెన్, కోడుగుడ్లు తినడాకి ప్రజలు భయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 90 శాతం, తెలంగాణలో దాదాపు 70శాతం ప్రజలు చికెన్, కోడి గుడ్లు తినడంలేదని కొన్ని సర్వేల్లో తేలినట్లు ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రజలు మాత్రం ముందస్తు జాగ్రత్తలను పాటిస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే చికెన్, మటన్ దుకాణాల వద్ద క్యూ కట్టె ప్రజలు ఈ ఆదివారం మాత్రం జిల్లా కేంద్రంలోని చికెన్ దుకాణాల వద్ద చికెన్ ప్రియులు లేక వెలవెల పోగా మటన్, చేపల దుకాణాల వద్ద మాత్రం జనంతో సందడి చేశాయి. స్కిన్‌లెస్ చికెన్ కిలోకు రూ. 240 ధర ఉండగా బర్డ్‌ఫ్లూతో రూ. 180కు పడిపోయింది. అయిన బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ దుకాణాలకు వెల్లడం లేదు. మటన్ కిలోకు రూ. 800లు, చేపలు(బొమ్మెలు)కిలోకు రూ. 600 నుండి రూ. 500లు ధర పెట్టి తీసకెళ్తున్నారు. చికెన్ అమ్మకాలు తగ్గడంతో వ్యాపారులు ఆందోళనకు గురి అవుతున్నారు. చికెన్ అమ్మకాలు తగ్గి మటన్, చేపల విక్రయాలు పెరగాయని వ్యాపారులు తెలిపారు.



కొనుగోళ్లు లేక వెలవెలబోతున్న చికెన్ సెంటర్

చికెన్, కోడిగుడ్లు తినాలంటే భయం..

- బీ రాజేందర్, టీచర్, సిరిసిల్ల



పక్క రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ పెరగడంతో చికెన్, కోడి గుడ్లు తినాలంటే భయం అవుతోంది. తెలంగాణలో బర్డ్‌ఫ్లూ ప్రభావం పడకుండా ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాకపోయినా చికెన్, కోడిగుడ్లకు కొంతకాలం దూరంగా ఉంటాం.

మటన్ అమ్మకాలు పెరగాయి..

- నాగరాజు, మటన్ వ్యాపారి, సిరిసిల్ల



గతంకంటే కొంతవరకు మటన్ అమ్మకాలు పెరగాయి. మటన్ ధరలు ఎక్కువైనా బర్డ్‌ఫ్లూ భయంతో కొంతమంది మటన్ తీసుకెళ్లడానికే ఆసక్తి చూపుతున్నారు. ఆదివారం అమ్మకాలు పెరగాయి.

ఆన్‌లైన్ గేములకు యువకుడి బలి

● అప్పుల పాలై ఆత్మహత్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేములకు బానిసైన ఓ వ్యక్తి అప్పులపాలై మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఏడిగ మధు(33) ఆన్‌లైన్, బెట్టింగ్ గేమ్స్ ఆడి అప్పులు పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఈనెల 10న తన ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో ముప్పిడి రాంరెడ్డి(72) అనే వృద్ధుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన రాంరెడ్డి ఈనెల 15న రాత్రి మెట్‌పల్లి గ్రామంలోని తన బామ్మర్ది తుమ్మల పురుషోత్తంరెడ్డి ఇంటికి వచ్చాడు. రాంరెడ్డి కుటుంబ సభ్యులు దూర మవడం వలన తాగుడుకు బానిసయ్యాడు. బామ్మర్ది పురుషోత్తంరెడ్డి ఇంట్లో లేని సమయంలో పురుగుల మందు తాగి మృతిచెందాడు. మృతుడి బామ్మర్ది పురుషోత్తంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



మహిపాల్ (ఫైల్)

ధర్మారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన ధర్మారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. శనివారం మండల కేంద్రానికి చెందిన నార మహిపాల్ (32)అనే యువకుడు బైక్‌పై ఎండపల్లి నుంచి ధర్మారంలోని ఓఫంక్షన్‌హాల్‌లో జరిగే వేడుకకు వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో మహిపాల్ తలవెనుక భాగంలో తీవ్రగాయాలు కాగా పక్క టెములకు విరిగాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటా హుటిన హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శని వారం రాత్రి చికిత్స పొందుతూ మహిపాల్ మరణించాడు. యువ కుడి తమ్ముడు జైపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శీలం లక్ష్మన్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఒకరు..

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్‌టీసీ బస్టాండ్‌లో చెన్నైకి చెందిన జీవా(55) అనేవ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆరునెలల క్రితం జీవా సుల్తానాబాద్ వచ్చాడని, ఇతను సమీప ప్రాంతాలలో దినసరి కూలీ చేస్తూ మద్యం తాగుతు బస్టాండ్‌లోనే పడుకుంటున్నాడని వివరించారు. శనివారం జీవా అధికంగా మద్యం సేవించి బస్టాండ్ ఆవరణలో నిద్రించగా అలాగే మృతిచెందాడు. ఆదివారం సాయంత్రం కొందరు గుర్తించడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామని, సహచర కూలి హరి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు..

కథలాపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన గడ్డమీద గంగు(72) అనేవృద్ధురాలి చీరెకు ప్రమాదశాత్తు నిప్పంటుకుని మృతి చెందింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. శనివారం రాత్రి సిలిండర్‌పై టీ తయారు చేసుకుంటున్న క్రమంలో ప్రమాదాశాత్తు చీరెకు నిప్పు అంటుకుంది. దీంతో తీవ్రగాయాలైన గంగును జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్టు తెలిపారు. మృతురాలు గంగు కొడుకు గంగనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

కుంభమేళాకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

● చికిత్స పొందుతూ మహిళ మృతి



ప్రమీల (ఫైల్)

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లిన మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. జగిత్యాలజిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన వెంగళ ప్రమీల(52) అనే మహిళ తన ఇద్దరు కొడుకులు, కోడళ్లు మనుమ రాళ్లతో కలిసి ప్రయాగ్‌రాజ్ (కుంభమేళా)కు మూడు వాహనాల్లో వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా మధ్యప్రదేశ్‌లోని రేవా ప్రాంతంలో గురువారం ప్రమీల ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రమీల తీవ్రంగా గాయపడడంతో సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీల పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. ప్రమీల మృతదేహాన్ని ఆమెస్వగ్రామమైన జూలపల్లికి తరలిస్తున్నట్లు సమాచారం.

మంగళపల్లెలో ట్రాక్టర్ దగ్ధం



దగ్ధమవుతున్న ట్రాక్టర్

కోనరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ఓరైతుకు చెందిన ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. కోనరావుపేట మండలం మంగళపల్లె గ్రామానికి చెందిన ఉప్పుల జీవన్ అనే రైతు తన ట్రాక్టర్‌ద్వారా చేనులో పత్తికట్టె చదునుచేస్తున్నాడు. పక్కకు నెట్టేసిన పత్తి కట్టకు అప్పటికే నిప్పు అంటించారు. పత్తి కట్టే వైపు మిగతా చేనులోని పత్తి కట్టను నెట్టే ప్రయత్నంలో కందకంలో ట్రాక్టర్ దిగబడింది. ఆభాగంలోని మండుతున్న పత్తికట్టే ట్రాక్టర్‌టైర్‌కు అంటుకొని మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. దీంతో బాధిత రైతుకు మూడులక్షల వరకు నష్టం వాటిలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

అటవీ ప్లాంటేషన్‌లో మంటలు

వీర్నపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బాబాయి చెరువుతండా గ్రామశివారులోని అటవీప్రాంతంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో పది హెక్టార్ల ప్లాంటేషన్ మొక్కలు ఆదివారం కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికిచేరుకొని అగ్నిమాపకశాఖకు సమాచారం అందించడంతో ఫైర్‌ఇంజన్, ఫైర్ బ్లోయర్స్‌తో మంటలను చల్లార్చారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ సెక్షన్ అధికారి భూలక్ష్మి పేర్కొన్నారు.

ఫోర్జరీ కేసులో నలుగురిపై కేసు

మానకొండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని వ్యవసాయభూమి ఫోర్జరీ కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన కిష్టయ్య పూర్వీకులకు చెందిన భూమికి నకిలీ సాదాబైనామా తయారు చేసి మోసపూరితంగా మ్యూటేషన్ చేసిన కేసులో వినయ్‌రావు, వీరయ్య, దివ్య, వెంకటేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అందరి చూపు.. ఉమ్మడి జిల్లా వైపు..

- పట్టభద్రుల ఎన్నికల్లో 45 శాతం ఓట్లు ఇక్కడివే
- ప్రత్యేక దృష్టి పెట్టిన అభ్యర్థులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా కీలకంగా మారింది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధికి సంబంధించిన ఈ ఎమ్మెల్సీ స్థానంలో ఉన్న ఓట్లలో 45.12శాతం ఓట్లు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. దీంతో అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థుల దృష్టి ఈ జిల్లాపైనే కేంద్రీకృతమవుతున్నది. పోటీలో ఉన్న అభ్యర్థులందరూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో మకాం వేసి తమ ప్రచారాలను కొనసాగిస్తున్నారు.



● పట్టు సాధించేందుకు..

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనుండడంతో ఇక్కడి ఫలితాలు ఆ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికల నుంచి బీఆర్‌ఎస్ పోటీ నుంచి తప్పుకోగా, కాంగ్రెస్, బీజేపీ బరిలో ఉన్నాయి. ఇక్కడ గెలుపు సాధించడం ద్వారా వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాదు ఏ ఎన్నికలు వచ్చినా ప్రజల్లో తమకు ఉన్న పట్టేమిటో చాటుకోవడానికి ఈ ఫలితం ఊతంగా నిలుస్తుందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో 42 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా కాంగ్రెస్‌కు చెందిన వారు 23 మంది, బీజేపీకి చెందిన వారు ఏడుగురు, బీఆర్‌ఎస్‌కు చెందిన12 మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పరిధిలో ఆరుగురు ఎంపీలు ఉండగా నలుగురు బీజేపీకి చెందిన వారు, ఇద్దరు కాంగ్రెస్ వారున్నారు. బీఆర్‌ఎస్ పోటీ నుంచి తప్పుకోవడంతో కాంగ్రెస్, బీజేపీ ఈ పట్టభద్రుల స్థానాన్ని గెలుచుకోవడం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. అందుకే ఆ రాజకీయ పక్షాలు పట్టభద్రుల ఎన్నికల ఫలితాలను నిర్దేశించే స్థాయిలో ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాపైనే ప్రత్యేక దృష్టిసారించాయి.

● పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు

రెండు రాజకీయ పక్షాలు నియోజకవర్గ స్థాయిలో పార్టీశ్రేణులు, నాయకులు, పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో 25, 50 ఓట్లకు ఒక్కరిని ఇన్‌చార్జిగా నియమించి ఆ ఓటరుతో సత్సంబంధాలు పెట్టుకొని రోజూ మాట్లాడుతూ పోలింగ్ రోజు వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకొని వచ్చి ఓటు వేసేలా చూడాలని బాధ్యతలు అప్పగిస్తున్నాయి. ఓటర్లను నేరుగా కలిసేందుకు వీలులేని పరిస్థితి ఉండ డంతో పార్టీ కేడర్‌పైనే ప్రధాన బాధ్యతను ఉంచుతు న్నారని చెబుతున్నారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు, ప్రత్యర్థి పార్టీవారు తమ తమ సమావే శాల్లో మాట్లాడుతున్న అంశాలు ఏమిటి, వారు పన్ను తున్న వ్యూహాలు ఏమిటి అనే విషయాలు తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

● నియోజకవర్గ స్వరూపం

నియోజకవర్గ పరిధిలోకి 13 జిల్లాలు పూర్తిగా, 2 జిల్లాలు పాక్షికంగా వస్తాయి. ఆరు పార్లమెంట్ స్థానాలు, 42 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉన్నది. నియోజకవర్గ పరిధిలో 2,26, 765 మంది పురుషులు, 1,28,392 మహిళలు, ఇద్దరు థర్డ్‌జెండర్లు ఓటర్లుగా ఉన్నారు. మొత్తం నియోజకవర్గ పరిధిలో 3,55,159 ఓట్లు ఉన్నాయి. వీటిలో 1,60,260 ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోనే ఉన్నాయి. ఈ ఓట్లు నియోజకవర్గ పరిధిలోని మొత్తం ఓట్లలో 45.12శాతం కావడం గమనార్హం. కరీంనగర్ జిల్లాలో 71,545 ఓట్లు, పెద్దపల్లి జిల్లాలో 31,037 ఓట్లు, జగిత్యాల జిల్లాలో 35,281 ఓట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22,397 ఓట్లు ఉన్నాయి. కరీంనగర్ జిల్లా ఓట్లనే పరిగణలోకి తీసుకున్నా 20 శాతం ఓట్లు ఇక్కడే ఉన్నాయి. రాష్ట్రం లోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పట్టభద్రులు ఓట ర్లుగా ఉన్న ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగు తుండడంతో ఈ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది.

● ప్రచారంలో కీలకమవుతున్న బీసీ, స్థానిక నినాదాలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో స్థానిక, బీసీ నినాదాలు కీలకపాత్ర వహిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓట్లే 45శాతం కావడంతో స్థానిక నినాదం బలంగా వస్తున్నది. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి కరీంనగర్ జిల్లాకు చెందిన వారనే కారణంతోనే ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రాంతాల నుంచి నామినేషన్ వేసిన అభ్యర్థులందరూ తాము స్థానికులమని, తమకు అవకాశం కల్పించాలని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీసీ నినాదం బలంగానే వినవస్తున్నది. ఒకవైపు బీసీ కుల గణన జరుగుతుండడం, మరోవైపు రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లు పెంచాలని రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే తమ రాజకీయ అవకాశాలను కాలరాస్తున్నారని బీసీ వర్గాలు పలు రకాల కార్యక్రమాలను చేపడుతున్నాయి. బీసీ వాదం బలంగా ఉండడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు అగ్రవర్ణాలకు చెందినవారని, బీసీ కులానికి చెందిన తమకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా అభ్యర్థులు ప్రచారం చేసుకుంటున్నారు. స్థానిక, బీసీ నినాదాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

పోలీసులు పట్టించుకోవడం లేదు..

● న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపిన బాధితుడు



కేశవపట్నంలో పురుగుల మందు డబ్బాతో సెల్ టవర్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న బాధితుడు కొంరయ్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తనకు న్యాయం చేయాలని శంకరపట్నం మండలం కేశవపట్నంలో సెల్‌టవర్ ఎక్కి ఓవ్యక్తి నిరసన తెలిపిన సంఘటన చోటు చేసుకుంది. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన దుర్గం కొంరయ్య ఆదివారం శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. బాధితుడు కొంరయ్య మాట్లాడుతూ తన తమ్ముడు తిరుపతి రేకులు కూల్చి తనభార్యను కొట్టడంతో మనస్థాపం చెంది 15రోజుల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు. చికిత్స పొందుతూ శనివారం డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. అయితే తన భార్యను కొట్టిన తమ్ముడిపై సైదాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఎస్‌ఐ పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం జరగలేదంటూ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని సెల్‌టవర్ దించేందుకు ప్రయత్నాలు చేశారు. తనకు న్యాయం జరిగేలా చూస్తానంటేనే దిగుతానని, లేదంటే ఇక్కడే ఉంటానని భీష్మించుకొని కూర్చున్నాడు. పోలీసులు అతనికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి నచ్చజెప్పి కిందకి దింపి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

● కాలి బూడిదైన నగదు, నిత్యావసర సరుకులు



చింతకుంటలో కాలిపోయిన గుడిసె

కథలాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆలకుంట చిలుకవ్వ అనే మహిళ గుడిసె దగ్ధమైంది. విద్యుత్‌వైర్లు అంటుకోవడంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు వచ్చి మంటలు వ్యాపించాయి. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబసభ్యులకు మెలకువ రావడంతో బయటకు పరుగులు పెట్టారు. దీంతో ఎలాంటి ప్రాణానష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న 22 వేల రూపాయలు, నిత్యావసర వస్తువులు, బట్టలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఆదివారం కాంగ్రెస్ నాయకులు బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారు. కాగా కూలీ పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్న చిలుకవ్వ కుటుంబం ఈ ఘటనతో బజారున పడింది.

ఓదెల మల్లన్న ఆలయంలో అభివృద్ధి పనులు

- రూ.12.18 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు
- నిర్మాణ దశలో భక్తుల వసతి భవనాలు



నిర్మాణ దశలో భక్తుల వసతి గృహం

ఓదెల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రముఖ ఆలయమైన ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ.12.18కోట్లతో ప్రణాళికలను దేవాదాయ, ధర్మదాయ శాఖకు ప్రతిపాదించారు. అలాగే ఇందులో కొన్ని అభివృద్ధి పనులను చేపట్టారు. రూ.50 లక్షలతో భక్తులకు వసతి భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఆలయానికి రూ.47 లక్షల వ్యయంతో రథం, రూ. 50 లక్షలతో షెడ్ల నిర్మాణం, రూ.20 లక్షల వ్యయంతో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం కోసం అనుమతులు పొందారు. దాదాపు రూ.50 లక్షల వ్యయంతో మధున పోచమ్మ, బంగారు పోచమ్మ, కోనేరు నిర్మాణం కాగా, రూ.10 కోట్ల నిధుల వ్యయంతో ఆలయ ప్రాకారానికి, రాజగోపురానికి డీపీఆర్ తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు.

● దాతల సహకారంతో అభివృద్ధి పనులు

ప్రస్తుతం ఆలయంలో బంగారు పోచమ్మ, మదన పోచమ్మ, గుడిలో భక్తులకు కోనేరు పనులు పూర్త య్యాయి. దాతల సహకారంతో వీరభద్ర స్వామి ఆల యం నిర్మాణం పూర్తయి ప్రారంభమైంది. హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటు, మదన పోచమ్మ, బంగారు పోచమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ పనులు సాగుతున్నాయి. కాంట్రాక్టర్ సొంతంగా రూ.60 లక్షలతో గెస్ట్ హౌస్ నిర్మిస్తున్నారు. అలాగే కాలభైరవ విగ్రహానికి తొడుగులు ఏర్పాటు చేశారు. ఆలయ సందర్శనకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్, రెండు కూలర్లు ఏర్పాటు చేశారు.

● మిగిలిన అభివృద్ధి పనులు

ఆలయ పరిసరాల్లో మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం సామూహిక మరుగుదొడ్లు, స్నానాల గదులు నిర్మాణం చేయాల్సి ఉంది. పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల పట్టణంలో ఆలయ కమాన్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే కమిటీల తీర్మానాలు అధికారులకు పంపించారు. దుస్తులు మార్చుకు నేందుకు షెడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. అలాగే భక్తుల బోనాల తయారీకి షెడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. భక్తులకు సరిపడు స్థలం కోసం భూసేకరణ తోపాటు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

\- సదయ్య ఈవో ఓదెల




ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి నిధుల కేటాయింపు కొంత పరిమితంగా ఉంటుంది. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

చివరి మజిలీకి కష్టాలు

● అధ్వానంగా వైకుంఠధామాలు ● కనీస వసతులు లేక ఇబ్బందులు



మానకొండూర్: శ్రీనివాస్‌నగర్‌లో వైకుంఠధామంలో ధ్వంసమైన దింపుడు కల్లం గద్దె



గంగాధర: నిరుపయోగంగా లక్ష్మీదేవిపల్లి వైకుంఠధామం

గంగాధర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిల్లో అంత్యక్రియలు చేయడానికి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠ ధామాలు నిరూపయోగంగా మారుతున్నాయి. గంగాధర మండలంలో అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ప్రజలందరికి చివరి మజిలీ సాఫీగా సాగాలని ఆధునిక వైకుంఠధామాలు నిర్మించారు. పలు గ్రామాల్లో మునుపటి లాగా చెరువు గట్టుకో, వాగు ఒడ్డునో, సొంత స్థలాలు ఉన్న వారు వారి భూముల్లో అంత్యక్రియలు చేస్తుంటే భూముల్లేని పేదలు అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతుండేవారు. శ్మశాన వాటికలు నిర్మించడంతో ఈ సమస్యలు చాలావరకు తగ్గాయి. మండలంలోని రెండు గ్రామాల్లో మాత్రం అధికారుల నిర్లక్ష్యం వల్ల అంత్యక్రియలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హిమ్మత్‌నగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించారు. శ్మశాన వాటికలకు దారుల లేక ఇప్పటికి సొంత స్థలాల్లో, పేదలు వాగు ఒడ్డున అంత్యక్రియలు జరుపుతున్నారు. మూడేళ్లుగా ఈ గ్రామాల్లో నిర్మించిన వైకుంఠదామాలు వినియోగించడానికి వీలు లేకుండా పోయింది. పలుమార్లు ఈగ్రామాల్లోని వైకుంఠదామాల దారి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా స్పందంచడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మరమ్మతులు కరువు

మానకొండూర్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం పైకప్పు ఈదురు గాలులకు లేచిపోయింది. రెండేళ్లుగడిచినా మరమ్మతులు చేయడం లేదు. దింపుడు కల్లం గద్దె, మృతదేహాలను కాల్చే ప్రదేశం, ప్రవేశద్వారం దెబ్బతిన్నాయి. వైకుంఠధామంలో పిచ్చి చెట్లు మొలిచి అందులోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామంలో ఎవ్వరు మృతి చెందిన వారి పొలాల్లో దహన సంస్కారాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠధామంలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాట్‌ఫాంపైకి దూసుకువచ్చిన ఆర్టీసీ బస్సు

● మహిళకు స్వల్పగాయాలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండులో ఆదివారం ప్లాట్‌ఫాం పైకి బస్సు దూసుకురావడంతో మహిళకు స్వల్పగాయాలయ్యాయి. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగి త్యాల వెళ్లేందుకు ప్లాట్‌ఫాం వద్దకు వచ్చే క్రమంలో నిర్దేశిత స్థానాన్ని దాటుకుని ముందుకు వేగంగా దూసుకువచ్చింది. అప్రమత్తమైన ప్రయాణికులు అక్కడినుంచి తప్పించుకున్నారు. అక్కడేఉన్న ఓ మహిళచేతికి స్వల్పగాయమైంది. వెంటనే ఆర్టీసీ అధికారులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రయాణికులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్దప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

గంజాయితో పట్టుబడ్డ వ్యక్తికి రిమాండ్

రుద్రంగి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులోని నేవూరిపల్లి బస్టాండ్ వద్ద గంగాధర గ్రామానికి చెందిన పోత్తూరి రాకేష్ అనే వ్యక్తి వద్ద గంజాయి పట్టుకున్నామని చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితుడిని ఆరెస్ట్ చేసి జూడిషియల్ రిమాండ్ తరలించామని తెలిపారు.

అడవుల సంరక్షణకు

'ఫైర్‌లైన్స్'

- అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- నిరంతరం అటవీ శాఖ అధికారుల నిఘా
- పెరుగుతున్న అటవీ సంపద

వీర్నపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం వచ్చిందంటే ఏటా అడవులకు నిప్పంటుకోవడం సర్వసాధారణంగా మారింది. అడవిలో అగ్ని ప్రమాదాల వల్ల వృక్ష సంపద, వన్యప్రాణులకు హాని కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాల వల్ల వాతావరణ సమతుల్యం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే వీర్నపల్లి మండలం ఎక్కువ శాతం అటవీ విస్తీర్ణం కలిగి ఉంది. అధికారులు అటవీ సంరక్షణలో భాగంగా కిలోమీటర్ల మేర 'ఫైర్‌లైన్స్' ఏర్పాటు చేస్తున్నారు.

● అగ్ని ప్రమాదాలు జరిగే తీరు..

వేసవికాలంలో చెట్ల ఆకులు ఎక్కువగా రాలిపోతుంటాయి. అటవీప్రాంతంలోకి పశువులను తీసుకవెళ్లిన కాపరులు తునికాకు, ఇప్పపూలు, అడ్డపిక్కలు తదితర వాటి సేకరణ



ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తున్న కూలీలు

కోసం వెళ్లి ఎవరైనా అనుకోకుండా చుట్ట, సిగరెట్, బీడీ వంటివి తాగి పడేయడంతో ఎండిన ఆకులకు అంటుకొని మంటలు వ్యాప్తి చెందుతాయి. అలాగే ఆకతాయిల చేష్టల వల్ల కూడా అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. గిరిజన ప్రాంతంలో అడవుల్లో ఏటా ఏదో ఒక ప్రాంతంలో అడవికి నిప్పు రాజుకుని మంటలు చెలరేగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

● 'ఫైర్ లైన్స్' ఏర్పాటు..

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖ అధికారులు 'ఫైర్ లైన్స్' ఏర్పాటు చేస్తారు. అటవీ ప్రాంతంలో కాలిబాటలో ఐదు మీటర్ల వెడల్పుతో వీటిని ఏర్పాటు చేస్తారు. చుట్టుపక్కల ఉన్న ఎండిన ఆకులను కాలి బాటలో పరిచి నిప్పు పెడతారు. ఒకవేళ ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి మంటలు చెలరేగినా ఈ దారివరకే మంటలు వ్యాప్తి చెంది ఆరిపోతాయి. మిగతా ప్రాంతానికి మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్ లైన్స్ అరికడతాయి. అడవుల సంరక్షణకు ప్రతిఏటా అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేసవి ప్రారంభంలో ముందస్తు చర్యలు చేపడుతారు. ఫైర్‌లైన్స్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయడం ద్వారా అగ్ని ప్రమాదాలు రాకుండా అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది తీసుకున్న చర్యల వల్ల అడవులు ఎక్కువ శాతం కాలిపోకుండా చూశామని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

● రాత్రింబవళ్లు ప్రత్యేక నిఘా..

వేసవికాలంలో అటవీప్రాంతంలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు రాత్రిపగలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి ఎండిన ఆకులను పరిచి అవి పూర్తిగా కాలిపోయే వరకూ కాపలా ఉంటారు. అలాగే అనుకోకుండా మంటలు వ్యాప్తి చెందితే అందుబాటులో ఉన్న



వీర్నపల్లిలో ఏర్పాటు చేసిన ఫైర్‌లైన్

సిబ్బంది మంటలను అదుపుచేస్తారు. వీటివల్ల అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

● శాటిలైట్ ద్వారా ముందస్తు సమాచారం..

అటవీప్రాంతంలో పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారాన్ని తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని చేరవేస్తుంది. దీనితో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువస్తారు.

అన్ని ప్రాంతాల్లో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయాలి..



- బండారి మహేష్, గొర్ల కాపరి, మద్దిమల్ల

మండలంలోని అన్నిప్రాంతాల్లో ముందస్తుగా అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయాలి. ఫైర్‌లైన్స్ నామమాత్రంగా కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేయాలి. జంతువులు, అడవులకు నష్టం కలిగించొద్దు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..

- పద్మలత, ఎఫ్ఎస్‌వో, అల్మాస్‌పూర్

అడవులు, జంతువుల సంరక్షణ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలను ఫైర్ వాచర్స్ ద్వారా నివారిస్తున్నాం. అటవీ ప్రాంతంలో కిలోమీటర్ల పరిధిలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా మంటలను వ్యాప్తి చెందకుండా నివారించేలా కృషి చేస్తున్నాం. అలాగే అగ్నిప్రమాదాల నివారణపై పరిసర ప్రాంత ప్రజలకు పూర్తి అవగాహన కలిగిస్తున్నాం.



నిరుద్యోగుల కోసం పోరాటం చేసింది బీజేపీ మాత్రమే

● కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షానపోరాటం చేసింది ఒక్క బీజేపీ మాత్రమే అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ సోషల్‌మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధి కారంలోకి రావాలనే లక్ష్యంతో పనిచేసే కార్యకర్తలు బీజేపీకి సొంత మన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తే లాఠీ దెబ్బలు తిన్నామన్నారు. గ్రూప్‌వన్ ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తే నిరుద్యోగుల మధ్యకు చేరి బీఆర్ఎస్‌నాయకులు విధ్వంసం సృష్టించాలని చూశారన్నారు. కాంగ్రెస్‌నేతలు ప్రతి పనికి 14నుంచి 18శాతం కమిషన్ అడుగుతున్నారన్నారు. 317జీవోకోసం ఎంపీ కార్యాలయంలో దీక్షచేస్తే కార్యాలయగేట్లను గ్యాస్ కట్టర్లతో పోలీసులు కోశారన్నారు. నా ఆఫీసును ఎక్స్‌కావేటర్‌తో కూల్చాలని కేసీఆర్ సీపీకి వార్నింగ్ ఇచ్చారన్నారు. అయినా ఏనాడు భయపడలేదన్నారు. బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాల కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారన్నారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీఎమ్మెల్సీ ఎన్వీఎస్ ప్రసాద్, మాజీమేయర్ సునీల్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతరప్రాంతాల నుంచివచ్చిన భక్తులు ముందుగా రాజన్న కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో భక్తులు కుంకుమ పూజలో పాల్గొని బద్దిపోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వైభవంగా మల్లన్న బోనాలు



ఆత్మకూర్‌లో బోనాలతో బయలుదేరిన భక్తులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో మల్లన్న జాతరను యాదవులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లన్నస్వామి ఆలయాన్ని పచ్చటితోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయంనుంచి మండలంలోని ఆయాగ్రామాల్లోని భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి ఒడిబియ్యం పోసి కానుకలు సమర్పించుకున్నారు. సాయంత్రం మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేశారు. భక్తులు బోనమును నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పులతో ఆలయానికి బయలుదేరారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు బోనాలతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా మాజీసర్పంచ్ చౌట్‌పల్లి లావణ్య-అంజయ్యతోపాటు పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం, ఆలయాభివృద్ధి నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి ఆలయంలో భక్తుల పూజలు



ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. మాఘమాసం బహుళ చవితి సందర్భంగా. సుదూరప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. అందంగా పూలతో అలంకరించినస్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సెక్రెటరీ పూజలు..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాల యాన్ని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సెక్రెటరీ గుగులోతురవి దంపతులు ఆది వారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాల్లో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట అర్చకులు నేరెళ్ల విజయ్, సుముద్రాల వంశీకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని ఆదివారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రెటరీ గుగులోతు రవి దర్శించుకున్నారు. సతీసమేతంగా ఆలయంకు వచ్చిన ఆయన స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, ప్రధానర్చకులు రామకృష్ణ, ఉపప్రధానర్చకులు చిరంజీవి తదితరులు ఉన్నారు.



కొండగట్టు అంజన్న సన్నిధిలో రవి దంపతులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిలు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీలను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని కరీంనగర్, మానకొండూర్, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాలతో పాటు వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్ నియోజకవర్గాలకు మంత్రి పొన్నంప్రభాకర్ ఇంచార్జి మంత్రిగా వ్యవహరించనున్నారు. అలాగే కరీంనగర్ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ భానుప్రసాద్, పురుమల్ల శ్రీనివాస్ ఇంచార్జిలుగా, కోఆర్డినేటర్‌గా ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి నియామకమయ్యారు. చొప్పదండి కోఆర్డినేటర్‌గా ఎనగల వెంకట్రాంరెడ్డి, మానకొండూర్‌కు గంప వేణుగోపాల్. హుజురాబాద్‌కు ఎండీ రియాజ్‌ను కోఆర్డినేటర్‌లుగా నియమించారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జిగా ఒడితెల ప్రణవ్‌బాబును నియమించారు. కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలను ఆయా నియోజకవర్గ ఇంచార్జిలుగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే లేనిచోట డిఫీటెడ్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఇంచార్జిగా నియమించారు. కరీంనగర్ సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి నిజామాబాద్ అర్బన్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలోగల గణపతి ఆలయంలో ఆదివారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, స్థానిక వేదపండితులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



గణపతి ఆలయంలో అభిషేకాది పూజలు

కొన'సాగు'తున్న పనులు

- నత్తనడకన రైల్వే ఫ్లైఓవర్ పనులు
- భూ యజమానులకు అందని పరిహారం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కూనారం ఫ్లైవోవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. సౌత్ సెంట్రల్ రైల్వే చేపట్టే పనులు కొనసాగుతుండగా రోడ్డు భవనాల శాఖ పనులు నిలిచిపోయాయి. టెండర్ కాలం ముగిసిన పనులు 60 శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లా కేంద్రంలోని కూనారం రైల్వే గేటు వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.119 కోట్లు కేటాయించింది. రోడ్లు భవనాల శాఖ రూ.34 కోట్లతో ట్రాక్‌కు ఇరువైపుల వంతెన నిర్మించాల్సి ఉంది. మిగితా రూ.85 కోట్లతో ట్రాక్ లైన్ పై సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ స్టీల్ వంతెన నిర్మించాల్సి ఉంది. పట్టాలకు ఇరువైపుల 550 మీటర్ల వంతెన 46 పిల్లర్లతో ఆర్‌అండ్‌బీ శాఖ పనులు చేయాల్సి ఉంది. సర్వీస్ రోడ్డు అప్రోజ్ రోడ్డు, బ్రిడ్జీ పనులు నిలిచిపోయాయి. ఈ పనులకు రెండు సార్లు భూమి పూజ చేసినప్పటికి ప్రారంభం కాలేదు. ముచ్చటగా మూడో సారి 2022లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సెప్టెంబరు 2024 నాటికి పూర్తి చేయాల్సి ఉండగా పనులు కొనసాగుతున్నాయి. రైల్వే శాఖ పనులు జరుగుతుండగా ఆర్‌అండ్‌బీ శాఖ పనులు ముందుకు సాగడం లేదు. డ్రాయింగ్ అప్రూవల్, ల్యాండ్ అక్వేషన్‌లో సమస్యలు, విద్యుత్ లైన్ల తొలగింపు తదితర అంశాలు నిర్మాణానికి అడ్డంకిగా మారాయి. ఈ సమస్యలను పరిష్కరించి భూసేకరణ చేసి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. అయితే భూ యజమానులకు డబ్బులు చెల్లించకపోవడంతో రోడ్డు భవనాల శాఖ అధికారులు పనులు నిలిపివేశారు. పనులు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గతేడాది మార్చిలో రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులతో బ్రిడ్జి వద్ద సమావేశం నిర్వహించారు. అక్టోబర్ వరకు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపాడు. ఇది జరిగి సుమారు ఏడాది కావస్తున్నా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.



కొసాగుతున్న రైల్వే ఫ్లైఓవర్ పనులు

భూ సేకరణ డబ్బులు చెల్లించలేదు

- ఆర్‌అండ్‌బీ ఈఈ డీ బాపు సింగ్

బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఆలస్యం వాస్తవమే. అయితే భూ సేకరణ చేసి వివరాలు ప్రభుత్వానికి పంపించాం. డబ్బులు వచ్చాక రెవెన్యూ శాఖ అధికారులు భూమి యజమానులకు అందజేస్తారు. అప్పటి వరకు పనులు జరగవు.

● వాహనదారుల ఇక్కట్లు

కూనారం రూట్‌లో రైల్వే గేటు పడిందంటే గంటకు పై మాటే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నుంచి ఐదు రైళ్లు వెళితే గాని గేటు తెరవకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. 2022లో ఫ్లైవోర్ బ్రిడ్జి పనులు మొదలయినప్పటికి ఇప్పటికి పూర్తి కాకపోవడంతో ఏళ్ళ తరబడి సమస్య అలాగే వెంటాడుతోంది. గుంపుల తనుగుల మధ్య ఒక వంతెన, హుస్సేనిమియా వాగు పై చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి మధ్య మరో వంతెన, కునారం వద్ద మరో బ్రిడ్జి నిర్మించడంతో ఈ దారి గుండా వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది. మంథని వరంగల్, జమ్మికుంట, కాల్వ శ్రీరాంపూర్‌లకు వాహనాలు ఈ దారి గుండా వెళ్తున్నాయి. గేటు సమస్యతో ఈ దారి గుండా వెళ్ళే ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులు, గర్భిణులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పాఠశాలలకు, కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు సమయానికి చేరుకోక చివాట్లు పడుతున్నారు. బయోమెట్రిక్ విధానంతో ఉద్యోగులు సరైన సమయానికి చేరుకోక పోవడంతో గైర్హాజరు కావాల్సి వస్తోంది. ఆటోలు, టాటా ఏసీలు గంటల తరబడి గేటు వద్దే ఉండడం వల్ల ట్రిప్పులు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగే చోట తాత్కాలిక రోడ్డు వేయకపోవడంతో దుమ్ముధూళితోనే గంటల తరబడి గడుపుతున్నారు. బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



గేటు వద్ద వాహనదారుల నిరీక్షణ

అసంపూర్తిగా మోడల్ గ్రామపంచాయతీ భవనం



అసంపూర్తిగా నిలిచిపోన మోడల్ గ్రామపంచాయతీ భవన నిర్మాణం

కోనరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో చేపట్టిన మోడల్ గ్రామపంచాయతీ భవన నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. మెరుగైన పాలన అందించడానికి మోడల్ గ్రామపంచాయతీ భవనం నిర్మించాలని నిధులు మంజూరు చేసిన అసంపూర్తిగానే మిగిలిపోయింది. మండల కేంద్రంలో పురాతన గ్రామపంచాయతీ భవనం కూలిపోయే దశకు చేరుకోవడంతో ప్రభుత్వం మోడల్ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఉపాధిహామీ పథకంలో రూ.20లక్షలు మంజూరుచేసింది. రెండు అంతస్థులు స్లాబులు పోసిన సదరు కాంట్రాక్టర్ అర్ధంతరంగా వదిలేశారు. దీంతో గ్రామపంచాయతీ విధులు నిర్వర్తించడం కోసం భవనం లేకపోవడం వల్ల ఇబ్బందికరంగా మారింది. భవన నిర్మాణం పూర్తికావాలంటే మరో రూ.30లక్షల నిధుల మంజూరుకు ప్రతిపాదన పంపామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో పనులు పూర్తిచేస్తాం..

- ఫిరోజ్‌పాషా, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు



కోనరావుపేట మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ గ్రామపంచాయతీ భవనం మధ్యలో ఆగిపోయింది. సమస్యను సంబంధిత అధికారులతో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్తాం. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో పనులు పూర్తి చేసేలా చూస్తాం.

గంజాయి పట్టివేత

వీర్నపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు ప్రాంతంలో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా ముగ్గురు వ్యక్తుల వద్ద 110 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. ఎస్ఐ ఎల్లయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌సింగ్‌తండా గ్రామానికి చెందిన దినేష్, పవన్, హరీష్ అనే ముగ్గురు గంజాయిని మండలంలోని యువతకు, చుట్టుపక్కల గ్రామాల యువతకు అమ్ముతున్నారని తెలిపారు. గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరాటే పోటీల్లో బాలికలకు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

కోనరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి బాలికలు బంగారు పతకాలు సాధించారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాష్ట్రస్థాయి ఆల్ స్టైల్ కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో కోనరావుపేట మండలం బావుసాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. నలుగురు బాలికలు బంగారు పతకాలు సాధించినట్లు ఒకినవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ మంగళగిరి శ్రీనివాస్ తెలిపారు. సీనియర్ కటా విభాగంలో భూక్య గంగాదేవి గోల్డ్ మెడల్, ఎస్‌కె సల్మా గోల్డ్ మెడల్, జూనియర్ కటా విభాగంలో జంగం శివాని, హర్షిని గోల్డ్ మెడలు సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఎమ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాలిపెల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతం అయ్యింది. కరీంనగర్‌లోని శ్రీధన్వి న్యూరో స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. న్యూరో ఫిజీషియన్ అనీల్‌కుమార్ తాటికొండ తన స్వగ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం అని గ్రామస్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి తాటికొండ అనీల్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు చంద్రారెడ్డి, వాణీదేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్యామలాదేవిసుధాకర్‌రెడ్డి, మాజీ ప్యాక్స్‌చైర్మన్ మాధవరెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు ప్రమోద, ఈతరం యువజన సంఘ వ్యవస్థాపకుడు ఎండ్ర నారాయణ, దుర్గాప్రసాద్, సింగిరెడ్డి రమణారెడ్డి, సూర్యనారాయణలతో పాటు ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మంటల్లో హరితహారం మొక్కలు..

- పొగతో ఇబ్బందులు పడ్డ వాహనదారులు



మంటల్లో కాలిపోతున్న మొక్కలు

చందుర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని వీరునిగడ్డ ప్రాంతంలో ఆదివారం హరితహారం మొక్కలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. వీరునిగడ్డ ప్రాంతంలో ఉపాధిహామీ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు బీడీ తాగి పడేయడంతో మంటలు వ్యాపించినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. మొక్కలు మంటల్లో కాలిపోవడంతో రోడ్డుపై పొగ కమ్ముకుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

కొత్తపల్లి డబుల్ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అధ్వానంగా మారిన కొత్తపల్లి ప్రధాన రోడ్డు

గంభీరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం కొత్తపల్లి డబుల్ రోడ్డుకు ఏళ్లు గడుస్తున్నా మోక్షం లభించడం లేదు. గుంతల రోడ్డుతో ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అనేకసార్లు స్థానిక నేతలు పాలకులు, అధికారులకు చెప్పినా పట్టింపు కరువైంది. కొత్తపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి శిలాజీనగర్ గ్రామ సరిహద్దు వరకున్న 4 కిలోమీటర్ల ప్రధాన రోడ్డుకు ఏళ్లు గడుస్తున్నా మోక్షం లభించడం లేదు. రోడ్డు నిర్మాణం కోసం అప్పటి మంత్రి కేటీఆర్ డబుల్ రోడ్డుతోపాటు సెంట్రల్ లైటింగ్ కోసం రూ.5కోట్లకు పైగా నిధులు మంజూరుచేయించారు. శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆగమేఘాల మీద రోడ్డు పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడం, ఎన్నికలు జరగడం, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికల సమయంలో మంజూరైన కొన్నిచోట్ల నిధులు రద్దు కావడం, అందులో కొత్తపల్లి రోడ్డు కూడా ఉంది. నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం వెక్కిరిస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పటికే కొత్తపల్లి డబుల్ రోడ్డు సమస్యను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి దృష్టికి ఈప్రాంత కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లారు. దీంతో ఆయన నేతృత్వంలో స్థానిక కాంగ్రెస్ నేతలు ఇటీవల మంత్రి సీతక్కను కలిసి రోడ్డు పరిస్థితిని వివరించారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి..

- పెద్దూరు పర్శరాములు గౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు

కొత్తపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి శిలాజీనగర్ గ్రామ శివారు వరకు డబుల్‌రోడ్డు నిర్మించాలి. రోడ్డు గుంతల మయంతో అధ్వానంగా మారింది. వాహనాలు నడవలేని దుస్థితి నెలకొంది. రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు కోసం ఎన్నోసార్లు ధర్నాలు, దీక్షలు చేశాం. రోడ్డుకు నిధులు మంజూరైనట్టే అయి వెనక్కి వెళ్లడం కరెక్ట్ కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, రోడ్డును నిర్మాణం చేపట్టాలి.

ఘనంగా పోచమ్మ బోనాలు



నారాయణపూర్‌లో బోనాలు తీస్తున్న మహిళలు



మర్రిపల్లిలో బోనాలతో మహిళలు..

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్‌లో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వరకు వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం సభ్యులు రాజయ్య, బాబు, అంజి, శ్రీనివాస్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లిలో చలి బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామ దేవత అయిన పోచమ్మ దేవాలయం వద్ద ఉదయం నుంచి చలి బోనాలతో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఇష్టమైన బెల్లం అన్నం ప్రసాదంగా సమర్పించారు. అనంతరం అమ్మవారి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు.

● గంభీరావుపేట : మండలంలోని ముస్తఫానగర్ గ్రామంలో ఆదివారం ఘనంగా నల్ల పోచమ్మ బోనాలు తీశారు. గ్రామస్తులు పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో చల్లగా ఉండాలని, పంట పొలాలు సమృద్ధిగా పండాలని పోచమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బండ రమేష్, బండ రాములు, బండ ఎర్ర ఎల్లయ్య, అనంత నర్సింలు, బండ అంజయ్య, మల్యాల సురేందర్, బండ విశ్వనాథం, బండ నరసయ్య, బండ విజయ్, శేరి పెళ్లి నారాయణ, మహిళలు, యువత నాయకులు పాల్గొన్నారు.

సాగు లెక్కకు 'డిజిటల్' సర్వే..

(5వ పేజీ తరువాయి)

నామాపూర్‌లో 2,446 మంది రైతులు 1,849 ఎకరాలు, సిరిసిల్ల అర్బన్ మండలంలో బోనాలలో 2,900 మంది రైతులు 2,099 ఎకరాలు, సిరిసిల్లలో 3,822మంది రైతులు 1,852 ఎకరాలు, తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో 3,501 మంది రైతులు 2,100 ఎకరాలు, జిల్లెల్లలో 3,326 మంది రైతులు, 1,848 ఎకరాలు, కస్బెకట్కూర్‌లో 2,531 మంది రైతులు 1,839 ఎకరాలు, నేరేళ్లలో 2,657 మంది రైతులు 1,843 ఎకరాలు, తాడూర్‌లో 3,148 మంది రైతులు 2,097ఎకరాలు, తంగళ్లపల్లిలో 4,005మంది రైతులు 2,094 ఎకరాలు, వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో 2,933 మంది రైతులు 2,103 ఎకరాలు, వీర్నపల్లిలో 2,684 మంది రైతులు 2,099 ఎకరాలు, ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో 2,336 మంది రైతులు, 1,849 ఎకరాలు, గొల్లపల్లిలో 2,737మంది రైతులు, 2,094 ఎకరాలు, వెంకటాపూర్‌లో 3,842 మంది రైతులు 1,846 ఎకరాలు, బోయినపల్లి మండలం కొదురుపాకలో 3,125మంది రైతులు 1,845 ఎకరాలు, బోయినపల్లి 2,816 మంది రైతులు, 1,849 ఎకరాలు, కోరెంలో 3,657 మంది రైతులు 2,091 ఎకరాలు, విలాసాగర్‌లో 2,857 మంది రైతులు 1,839 ఎకరాలు, చందుర్తి మండలం బండపల్లిలో 2,231 మంది రైతులు 1,843 ఎకరాలు, మల్యాలలో 1,748 మంది రైతులు 2,085 ఎకరాలు, మర్రిగడ్డలో 2,352 మంది రైతులు 2,098 ఎకరాలు, కోనరావుపేట మండలం బావుసాయిపేటలో 2,565 మంది రైతులు 1,843 ఎకరాలు, కొలనూర్‌లో 2,637 మంది రైతులు 2,097 ఎకరాలు, కోనరావుపేటలో 3,060 మంది రైతులు 2,096 ఎకరాలు, నిమ్మపల్లిలో 2,077 మంది రైతులు 1,847 ఎకరాలు, నిజామాబాద్‌లో 2,211 మంది రైతులు 1,848 ఎకరాలు, సుద్దాలలో 2,775 మంది రైతులు 1,847 ఎకరాలు, రుద్రంగి మండలం మానాలలో 1,381 మంది రైతులు 1,353 ఎకరాలు, వేములవాడ మండలం నాంపల్లిలో 3,077మంది రైతులు 2,095 ఎకరాలు, శాత్రాజుపల్లిలో 2,688 మంది రైతులు 2,094 ఎకరాలు, వేములవాడ రూరల్ మండలం బొల్లారంలో 2,908మంది రైతులు 1,847 ఎకరాలు, మర్రిపల్లిలో 3,752 మంది రైతులు 1,850 ఎకరాలు, వట్టెంలలో 2,075 మంది రైతులు 2,093 ఎకరాల్లో సర్వే చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద వచ్చిన లెక్కల ప్రకారం క్లస్టర్‌లలో అధికారులు సర్వే చేస్తున్నారు.

● నెట్‌వర్క్‌తో ఇబ్బందులు..

గ్రామీణ ప్రాంతాల్లో పంటపొలాల వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఫోన్ యాప్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో సాంకేతిక సమస్యలతో వ్యవసాయ విస్తరణ అధికారులు ఇబ్బందులు పడడం కనిపిస్తోంది. భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా మారుమూల ప్రాంతాలకు వెళ్లడం ద్వారా నెట్‌వర్క్ కవరేజీ లేకపోవడంతో సర్వే నంబర్ వద్ద పంటల వివరాలు నమోదు చేసి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో సర్వే వేగంగా జరగడం లేదు.

● వరివైపే మొగ్గు..

జిల్లాలో యాసంగిలో వరివైపే రైతులు మొగ్గు చూపారు. 1.80లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో 1.76 లక్షల వరకు వరి సాగు చేసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన లెక్క ప్రకారం గంభీరావుపేటలో 18వేల ఎకరాలు, ఇల్లంతకుంటలో 26,124 వేల ఎకరాలు, ముస్తాబాద్‌లో 20,006 వేల ఎకరాలు, సిరిసిల్లలో 3,803 ఎకరాలు, తంగళ్లపల్లిలో 18,060 ఎకరాలు, వీర్నపల్లిలో 6,520 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 16,359 ఎకరాలు, బోయినపల్లిలో 12,510 ఎకరాలు, చందుర్తిలో 16,545 ఎకరాలు, కోనరావుపేటలో 17,806ఎకరాలు, రుద్రంగిలో 4,850 ఎకరాలు, వేములవాడలో 2,500 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 9,500 ఎకరాల వరకు వరిసాగు చేశారు. దీంతో పాటు మొక్కజొన్న 1,491 ఎకరాలు, గోదుమ 50 ఎకరాలు, కందులు 180 ఎకరాలు, పల్లి 25 ఎకరాలు, నువ్వులు 134 ఎకరాలు, పొద్దు తిరుగుడు 1,021 ఎకరాల వరకు సాగు చేశారు.

కేసీఆర్‌నగర్‌లో పోలీస్ బందోబస్తు మధ్య తనిఖీలు



మండెపల్లి శివారులోని కేసీఆర్‌నగర్‌లో భారీగా పోలీసులు..



వివరాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని నిరుపేదలకు గత ప్రభుత్వం అందించిన డబుల్ బెడ్‌రూంలను అమ్ముకోవడంతోపాటు అద్దెకు ఇస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున పోలీసుల బందోబస్తు మధ్య రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్ నగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. సిరిసిల్ల పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదల కోసం గత ప్రభుత్వం మండెపల్లి శివారులో 1250 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించింది. రెండు సంవత్సరాల క్రితం సిరిసిల్లలో సర్వేలు చేపట్టి డ్రా పద్ధతిన మున్సిపల్ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ బెడ్ రూం ఇళ్లను అందించారు. అయితే సిరిసిల్ల పట్టణానికి 10కిలోమీటర్ల దూరంలో కేసీఆర్‌నగర్ ఉండడంతో చాలా లబ్ధిదారులు నివాసం ఉండకుండా అద్దెకు ఇవ్వడంతో పాటు అమ్ముకుంటున్నారని, చాలా వరకు నివాసం ఉండడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. స్పందించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున 150 మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు, అన్ని మండలాలకు చెందిన 13 మంది తహసీల్దార్‌లు, ఎంపీవోలతో ఇన్‌చార్జ్ ఆర్డీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రాధాబాయి, గృహ నిర్మాణ శాఖ ఈఈ చెన్నయ్యల ఆధ్వర్యంలో చేపట్టిన రీ సర్వే చేపట్టారు. ఈ క్రమంలో భారీగా పోలీసు బందోబస్తు మధ్య ఇంటింటికి వెళ్లి రీసర్వే చేపట్టి వివరాలను సేకరించారు.

చెరువుల్లోకి రంగనాయక సాగర్ జలాలు

- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండలంలోని పలుగ్రామాల్లోకి రంగనాయకసాగర్ జలాలు రావడంతో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలను జరుపుకున్నారు. రంగనాయక సాగర్ కాలువల నుంచి నీళ్లు రావడంతో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు హర్షం వ్యక్తం చేస్తూ చిన్నలింగాపూర్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ బైరినేని రాము ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



చిన్నలింగాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం..



కంచర్లలో ప్రధాన రహదారి వెంట, వీర్నపల్లి ఆదర్శ పాఠశాల చుట్టూ ఎండిపోయిన మొక్కలు

వీర్నపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఏటా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించి మొక్కలు నాటుతున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడా పూర్తిస్థాయిలో పచ్చదనం కనిపించడం లేదు. మండలం కేంద్రంలోని ఆదర్శ పాఠశాల చుట్టూ నాటిన మొక్కలతో పాటు, కంచర్ల గ్రామ శివారులో ప్రధాన రహదారి వెంబడి నాటిన మొక్కలు సంరక్షణ సరిగా లేకపోవడంతో ఎండిపోయి కనబడుతున్నాయి. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పంచాయతీ కార్యదర్శులతో పాటు సిబ్బంది ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్నారు. మొక్కలకు ప్రతిరోజు సరిపడ నీటిని పట్టాల్సి ఉన్న కొద్దిపాటి నీళ్లతో కాలం వెళ్లదీస్తున్నారు. పలు గ్రామాల్లో పల్లె ప్రకృతివనాల్లో నాటిన మొక్కలకు సరిగా నీరు అందక ఎండిపోతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెంచి సంరక్షించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

పల్లె ప్రకృతివనంపై పట్టింపేదీ..?



అల్మాస్‌పూర్ శివారులోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పచ్చదనం పెంచేందుకు గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ప్రత్యేక స్థలాలను కేటాయించి మంజూరు చేసిన నిధులతో మొక్కలను నాటింది. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికార గణం నిర్లక్ష్యంతో సర్కారు లక్ష్యం ఎండిపోయింది. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని కొచ్చ గుట్టకు అధికారులు పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. పట్టించుకునే వారు లేక మొక్కలు ఎండిపోయాయి. పల్లె ప్రకృతి వనం వద్ద గేట్లను నిర్లక్ష్యంగా వదేశారు. ఫలితంగా ఊరికి చివర పల్లె ప్రకృతి వనం మందుబాబులకు అడ్డాగా మారడంతో పాటు ఆహ్లాదం అందకుండాపోతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాన్ని పట్టించుకుని మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

గంభీరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని ముందస్తుగా మండలంలోని దమ్మన్నపేట గ్రామ సమీప రోడ్డు పక్కన ఆదివారం చిన్నారులు మొక్కలు నాటి హరిత చిరుకానుకను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి, యూత్ నాయకుడు ఇరిగి సందీప్, చిన్నారులు ఉన్నారు.

సిరిసిల్ల పట్టణ ముదిరాజ్ సంఘం కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం స్థానిక పెద్దమ్మ దేవాలయం ఆవరణలో జరగాయి. సంఘం పట్టణ అధ్యక్షుడిగా వంకాయల కార్తిక్, ఉపాధ్యక్షులు బొల్లాజు శ్రీనివాస్, ఎంబేరి మహేందర్, ప్రధాన కార్యదర్శి కోల నరేష్, సహాయ కార్యదర్శులు రాగుల నరేష్, పండుగ రాజు, కోశాధికారి పోలుక ఆనంద్, కార్యవర్గ సభ్యులు పండుగ దేవయ్య, రాగుల శ్రీనివాస్, గొడుగు అరుణ్, చంద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సన్మానించారు.

మాలమహానాడు కార్యవర్గం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గాలిపెల్లి గ్రామ మాల మహానాడు అధ్యక్షుడుగా దండి రాజేశం ఎన్నికయ్యాడు. సంఘ భవనంలో ఆదివారం సమావేశం జరిగింది. ఉపాధ్యక్షుడుగా న్యాత పోచయ్య,కార్యదర్శిగా సొల్లు దామోదర్, కోశాధికారిగా దసనం స్వామి, ఆర్గనైజర్‌గా దండి మల్లేశం, సహ ఆర్గనైజర్‌గా దండి ఎల్లయ్య, ప్రచార కార్యదర్శిగా దండి మహేందర్, సలహాదారులుగా పోచయ్య, స్వామి,శంకరయ్య, సాయిలు, అంజనేయులు, సురేష్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి సభ్యులు అభినందనలు తెలిపారు.

బీజేపీతోనే సమస్యలు పరిష్కారం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు గెలువడం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ ఇంచార్జ్ నాగసముద్రాల సంతోష్ పేర్కొన్నారు. మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌తో కలిసి ఇల్లంతకుంటలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో పనిచేసిన ఎమ్మెల్సీలు సమస్యల పరిష్కారంలో విఫలం చెందారని విమర్శించారు. ఎమ్మెల్సీలుగా పోటీ చేస్తున్న అంజిరెడ్డి, కొమురయ్యలకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మామిడి హరీష్, పండుగు లచ్చయ్య, అనీల్, గోపాల్, శ్రీనివాస్, శ్రీకాంత్, ముత్తక్క, రవి, కార్తీక్, బాలయ్య, సుధీర్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.